# పనిష్‌మెంట్

రెడ్డిగారి భవంతి వచ్చే పోయే జనంతో కోలాహలంగా ఉంది. పైరవీలకు, పంచాయితీలకు, తీర్మానాలకు ఆ ఇల్లు ఓ వేదిక. సూర్యోదయంతో వచ్చిన మోతీ అలాగే గేటు పిల్లరును ఆనుకుని కూర్చుంది.

మోతీ ముఖంలో నిరాశలు గూడు కట్టుకొని ఉన్నాయి. ముడతలు పడ్డ ముఖంలో, జీవితంలోని కష్టాలకు గుర్తుగా నొసలుపై గీతలు అడ్డంగా ఉన్నాయి.

కళ్ళలో ఏవో ఆశలు మిణుగురు పురుగుల్లా వెలుగుతున్నాయి. కొడుకు రాముడు హత్యచేశాడని న్యాయస్థానం రుజువు చేసింది. అతనికి ఉరిశిక్ష విధించింది. ఆ ఆలోచనలతో మోతీ

గుండెలు బరువెక్కుతువున్నాయి. కొడుకులేని తన చివరి జీవితాన్ని ఊహించకోలేక పోతోంది.

కోర్టులో వకీళ్ళతో ఇక లాభం లేదని రాష్ట్రపతి క్షమాభిక్ష కోసం రాజారెడ్డి గారనే ఆ ప్రాంతపు యం.యల్.ఎ.గారిని ఆశ్రయించింది.

వారి దర్శనం కోసం ఎదురుచూస్తువుంది. తనకున్న అయిదు ఎకరాల మెట్టపొలం అమ్మి యం.ఎల్.ఏ గారి దోసిట్లో పోసింది. కానీ అనుకున్నంత ఫలితం కనబడడం లేదు.

ఉరితీసే గడువు సమీపిస్తోంది. మృత్యు కుహ్యారంలోకి ప్రవేశించనున్న కొడుకు జీవితాన్ని తలచుకొని ఎంతగానో ఏడుస్తుంది. భరించలేని బాధ గుండెను పిండేస్తుంటే రెండేళ్ళ నుండి కంటికి నిద్రలేదు, కాలికి నిలకడ లేదు.

భర్త పోయాడన్న బాధ. కొడుకు చస్తాడన్న వ్యథ మోతీని కృంగతీస్తున్నవి.

ఇంతలో రాజారెడ్డిగారు పెళ్ళిపీటల మీదకెళ్ళె పిండ్లి కొడుకులా వరండాలోకి వచ్చాడు. పెదవులపై చిరునవ్వులు తొణికిసలాడుతున్నాయి. తెల్లని ఖద్దరు ధోవతి, సిల్కు లాల్చి అతని హుందాతనాన్ని చాటుతున్నాయి.

రాజారెడ్డిని చూడగానే దేవుణ్ణి చూసినంత పనయింది మోతీకి. అంతవరకు ఆపుకున్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది.

"దొరా! ఖర్చులకు భయపడకండి, మిగిలిన ఆ చెలకనైనా అమ్మి నా కోడుకు ప్రాణాలు నిలబెట్టండి. ఎట్లాగైనా వాడు

బ్రతకాలి" అంటూ తన నిశ్చయాన్ని వెలిబుచ్చింది.

కేసును ఆలోచిస్తూ సిగారు వెలిగించాడు ప్రజానాయకుడు.

మోతీ ఇంకా తన గోడును వెల్ల గ్రక్కుతూనే ఉంది. "వాని శని మూడింది. వాడి తండ్రిని వాడే సంపుకున్నాడు. మందినేమైనా సంపిండా?" అంటూ "లా"కు దొరకని పాయింటుతో ఏడుస్తూ మాట్లాడుతు వుంది.

అది విన్న రాజారెడ్డి "తను చావడానికి కూడ చట్టం ఒప్పుకోదు. అది హత్య అయినా, ఆత్మహత్యయినా నేరం, నేరమే శిక్ష తప్పదు" అన్నాడు.

"సచ్చిన ముసలోడు ఏలాగో సచ్చిపాయ్! కనీసం ఈడన్నా బతకాలి కదా ! పెండ్లాం ఏడ్చి, ఏడ్చి సగం అయ్యింది. ఆని అత్తగారోళ్ళు గూడ కొంత డబ్బిస్తమంటున్రు. ఏదన్న సేసి నా కొడుకు ప్రాణం కాపాడు దొరా! నీ ఆకిలి వూకి, నా రుణం తీర్చుకుంటా" అంటూ మోతీ వెక్కి వెక్కి ఏడుస్తు వుంది.

అప్పుడే అక్కడికొస్తున్న కోడల్ని చూపిస్తూ - "అదిగో అది కూడ వస్తుంది. దాని ముఖం చూడు దొరా! అది కుమిలి కుమిలి ఏడ్చి సస్తుంది. అది కాపురానికొచ్చి కొద్దిరోజులైనా కాలేదు. వాడేమో జైలు పాలయ్యిండు. ఆనాటి నుంచి దాని కంటికి కునుకులేదు. దాని మొఖం సూసైనా సరే, ఆని పాణం కాపాడండి."

నేలను చూస్తూ ఏడుస్తున్న కోడలు లచ్చిమి దగ్గరికెళ్ళి తల నిమురుతూ-

"ఊర్కో-ఊర్కో-దొర ఎలాగైనా నీ పసుపు కుంకుమ కాపాడుతాడు, ఏడవకు" అంది.

రాజారెడ్డి ఆమె వైపు చూస్తూ, ఇంత చిన్న వయసులో వచ్చిన ఆపదను ఆలోచిస్తూ, సిగార్ దమ్ము లాగి పొగను గాలిలోకి వదిలాడు.

"ఇంకా ప్రయత్నం చేద్దాం-రేపు ముఖ్యమంత్రిని కలుద్దాం. ఆయన ద్వారా ఢిల్లీకి ఫోను చేయిద్దాం. ఈ సారి తప్పకుండ అవుతుంది"

రాజారెడ్డి మాటలకు మోతీ ప్రాణాలు లేచివచ్చినయి. కోడలు కళ్ళలో కొత్తకాంతులు వెలిగినయి. మోతీ, రెడ్డి కాళ్ళకు మొక్కుతు వుంది. కోడలు లచ్చిమి కొంగుతో కండ్లను తుడుచుకుంటుంది.

లచ్చిమికి పాతికేండ్లు. పసుపుపచ్చ రంగు, నల్లని కళ్ళు, తెల్లని పళ్ళు, రెడ్డి చూపులు తడబడ్డాయి.

మనసులో ఏదో కదిలింది.

సిగారును నేలకేసి విసిరి, మోతీని దగ్గరికి పిల్చి చెవిలో ఏదో చెప్పాడు రెడ్డి.

"అమ్మో! వద్దు దొరా?" అంటూ నోరు మూసుకుంది. మళ్ళీ చెప్పాడు రెడ్డి.

"అమ్మో! అది నాతో కాని పని దొరా!" అంటున్న మోతీకి

వణుకులాంటిది మొదలయ్యింది.

రాజారెడ్డి పెదాలపై ఓ మాదిరి నవ్వు నాట్యం చేసింది.

"ఇది మాత్రం నాతో అయ్యేపనా?"

ఆ మాటలకు మోతీ కొంతసేపు రాయిలా నిలబడింది.

"అప్పటికి పైకం తీసుకొని వస్తా!" అంటూ కోడలితో వెళ్ళిపోయింది.

దారిలో రెడ్డిగారు తన చెవిలో చెప్పిన రహస్యాన్ని కోడలు చెవిన వేసింది. అప్పుడు మోతీ కాళ్ళు వణికినయి. నాలికపై తడి ఆరి మాటలు తడబడ్డాయి. అది విన్న లచ్చిమి బొమ్మలా నిలబడింది. అలా నిలబడ్డ లచ్చిమి కళ్ళనుండి ఏకధారగా కన్నీరు జారుతు వుంది. "భగవంతుడా! నన్ను ముందు చంపు" అన్నప్పుడు ముక్కుపుటలు కదిలి వేడిశ్వాస బయటికొచ్చింది.

"ఆయన ఏలాగూ సస్తడు. నేనూ సస్త. కానీ ఈ పని సేయలేను."

"ఎవ్వరూ సావకూడదు. ఇద్దరూ బతకాలి- అందుకే" మోతీ అనుకోని నిబ్బరంతో అంది.

"ఎట్లా బతికేది, ఏం సేసేది? ఆ తర్వాత ఈ ముఖం ఎట్లా సూపేది-ఈ కుంపటి ఎట్లా భరించేది?"

"బతకాలి - భరించాలి. నా భర్తను నీ భర్త సంపినా నేను కోర్టులో సంపలేదని సాక్ష్యం ఇవ్వలేదా?"

"ఆయన మాత్రం సంపాలని సంపిండా? ఏదో మాటమీద

మాట పెరిగి, పెద్ద జగడమైంది"

"ఏది ఏమైనా సంపిండా లేదా? కోర్టులో అబద్ధం సెప్పినా సెప్పలేదా?"

"అది నీ కడుపు తీపి. అయినా నాకు సెప్పు, నీకు నోరెట్లా వచ్చింది?" అంటూ కుడిచేతితో తన నోరు మూసుకుంటూ ఏడుస్తు వుంది.

"ఆ...ఆ కడుపు తీపే...ఆ నోరే... అదే నా భర్తను సంపినా సంపలేదన్న ఆ నోరే, ఈ రోజు సెప్పేది"

"ఆపు అత్తా...ఆపు" అంటూ లచ్చిమి ఏడుస్తు వుంది.

"కానీ...కానీ...ఒక్కసారి ఆయనను సూసి వచ్చినంక"

"ఎందుకు-ఈ విషయం వానితో సెపుతావా ఏం?"

"లేదు! ఆయన్ని సూసి వస్త! అంతే"

★ ★ ★

జైల్లో విజిటర్సు గది.

గది బయట జవాను.

గదిలో రాముడు, లచ్చిమి. చుట్టూర భయంకర నిశ్శబ్దం. ఇద్దరి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

"అత్త-రెడ్డిగారితో మాట్లాడింది" అంటూ లచ్చిమి కళ్ళనీళ్ళు కార్చడం మొదలు పెట్టింది.

"ఏమన్నాడు?" రావుడు.

"తప్పక ఇడిపిస్తానన్నాడు, కానీ-"

"పైకం కావాలన్నాడా?"

"సెలకనమ్మి పైకం ఇస్తమన్నాం..."

"మరి..."

"..."

"సెప్పు..."

ఎలా చెప్పుతుంది? ఏమని చెప్పుతుంది? ఏడ్వటం తప్ప...

"చలో...చలో...టైమ్ హెూగయా..." జైల్ జవాను ఏదిలింపు.

"ఏదడిగినా ఇచ్చెయ్యండి. ఎంతడిగినా ఇచ్చెయ్యండి. చెలక...బావి....అన్నీ..."

"కాదు...అవన్ని కావు..." అంటూనే నేలను చూస్తోంది. కడుపులో కదిలిన దుఃఖం కనురెప్పలను తన్నుకొస్తుంది.

"నేను బతకాలి..."

"చలో...చలో బాహర్ చలో..."

రావుడు జైల్లోకి, లచ్చిమి బయటికి నడిచారు.

★ ★ ★

పట్టణంలో అధునాతనమైన హెూటల్ గది. చాలా అందంగా విలాసంగా ఉంది. మెత్తని డన్‌లప్ బెడ్‌పై తెల్లని బెడ్‌షీట్ పాలమీగడలా ఉంది. లచ్చిమి వలలో చిక్కుకున్న లేడిలా బెదురు బెదురుగా అదే బెడ్ పై కూర్చుంది.

ఎదుటి సోఫాలో కూర్చున్న రాజారెడ్డి, కాలుతున్న సిగరెట్టును యాష్‌ట్రేలో నలిపి వదలి, వెళ్ళి లచ్చిమి ప్రక్కన కూర్చుంటూ "అబ్బ! దిరిసెన పువ్వులా ఉన్నావ్..." అంటూ లచ్చిమి దగ్గరికి జరిగి కూర్చున్నాడు.

లచ్చిమికి గుండె వేగం హెచ్చినట్లయింది. రెండు చేతులతో ఆమె గుండెను అదిమి పట్టుకుని, మంచపు మూలన వొదిగిపోతు, తనపైకి వస్తున్న రెడ్డినే చూస్తూ వుంది. అప్పుడామెకు వంటిలోని నరాలు మొద్దుపారుతున్నట్లు, గుండె గడ్డకట్టినట్లు అనిపించింది.

"ఎయ్ ఎందుకట్ల బెదిరిపోతావ్ యిక్కడ ఎవరు రారులే!"

ఆమె రెప్పవాల్చకుండ అతన్నే చూస్తూవుంది. ఆయన అన్న మాట ఆమె చెవికి తాకినట్టులేదు కాని అతని చేతులు ఆమె భుజాలను తాకినట్టు అనిపించింది.

కళ్ళల్లో భయం, చూపుల్లో బెదురు, శ్వాసలో బాధ, వంటిలో వణుకు, కనురెప్పలు కొట్టడం మానేశాయి.

ఆమె మనసులో అత్తా - భర్త రూపాలు కదిలాయి.

"ఎవ్వరు... సావకూడదు" అత్త.

"నేను బతకాలి" భర్త.

బాధగా తలెత్తి చూసింది. వెలుగుతున్న ట్యూబ్‌లైట్ దగ్గర ఎగురుతున్న ఓ చిన్న మిడతను ప్రక్కనే పొంచి ఉన్న బల్లి నోటకరచి పట్టింది.

ఆయన లచ్చిమిని కసిగా తన కౌగిట్లో అదిమి పట్టాడు.

బల్లి నోటిలో ఉన్న మిడత గిలగిల తన్నుకుంటు వుంది.

అతని కౌగిలిలో ఆమె భయంగా, బాధగా శ్వాస వదులుతు వుంది.

బల్లి మిడతను చిదిమి-చిదిమి మ్రింగింది.

★ ★ ★

వారం గడిచాక ఓ ఉదయం రావుడిని ఉరి తాశారు.

ఆ వార్త విన్న మోతీ, ఏడ్చి, ఏడ్చి మూగయింది.

లచ్చిమి మాత్రం ఏడవడం లేదు నవ్వుతూ ఉంది.

★ ★ ★

కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఎన్నికలొచ్చాయి. తండలోని గిరిజనులను ఉద్దేసిస్తూ రెడ్డి-

"నేను రావునికి ఉరిశిక్షను తప్పించాలని, హైద్రాబాదు, అంతేకాదు ఢిల్లీకి తిరిగి తిరిగి ప్రయత్నించినా, ఫలించలేదన్న విషయం మీ అందరికీ తెలుసూ-"

అంతలోనే ఓరాయి వొచ్చి రెడ్డి తలకు తగిలింది. 'అమ్మా' అంటు కుప్పకూలాడు. 'రాయి ఎటునుండి వొచ్చింది? చుట్టూర జనం చూపులు. పోలీసుల ఉరుకులు పరుగులు.

ఆంధ్రప్రభ
వారపత్రిక